# పోలి 'ట్రిక్స్' !

-యర్రమిల్లి విజయలక్ష్మి



ఉన్నట్లుండి తన పక్కన బాంబు పేలినట్లు త్రుళ్లిపడింది. చుట్టూ వున్న స్నేహితుల వంక ఏమీ అర్థం కానట్లు అయోమయంగా చూసింది.

''ఏమిటి మీరంటున్నది.. నేనా..?!'' అంది గొప్ప దిగ్భ్రాంతితో-

''అవును.. నువ్వే.. నువ్వే.. నువ్వు తప్ప మన ఆడవాళ్లలో ఎవరికా అర్హత వుంది. నువ్వు డాక్టర్‌వి. ఫేమస్ గైనకాలజిస్టువి. సోషల్ వర్కర్‌వి. ఎన్నో మంచి పనులు చేసి ప్రశంసలు అవార్డులూ ప్రభుత్వం నుంచి పొందినదానివి.''

''అంతేనా ఇన్నర్ వీల్ సెక్రటరీవి.. ఎన్నో సంస్థలలో ఆఫీస్ బేరర్‌వి.''

''పేద స్త్రీలకు ఉచిత వైద్య సౌకర్యం అందిస్తావని జిల్లా అంతా పేరు పొందావు.. ఇంతకన్నా ఇంకేం క్వాలిఫికేషన్స్ కావాలి?''

ఫ్రెండ్స్ ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ముందు వాళ్ల మాటలు పట్టించుకోలేదు. ప్రలోభపడలేదు. తన ఆశయం వేరు. తన వృత్తి వేరు. ఎవరో ఏదో అంటుంటారు. అంత మాత్రాన టెంప్ట్ కాకూడదు అనుకుంది.

కానీ ఆ రాత్రి డైనింగ్ టేబుల్ ముందు యాదృచ్ఛికమో ఏమోకానీ భర్త కూడా అదే సూచన చేసేసరికి-

''ఇవ్వాళ మా ఫ్రెండ్సందరూ కూడా ఇదే మాట.. మీరు కూడా మొదలుపెట్టారేమిటి?'' నవ్వుతూ అంది. కాని ఈసారి తేలిగ్గా కొట్టిపడెయ్యలేకపోయింది.

''నేను అనటం కాదు.. ఊళ్లో చాలామంది అదే మాట అంటున్నారు.. వై డోంట్ యూ ట్రై..!'' అన్నాడు తనూ ఆలోచిస్తూ మోహన్రావ్.

వసంత ఏమీ మాట్లాడలేదు కాని మనసులో చిన్నగా ఆలోచన మొదలైంది. చట్టసభలలో 33శాతం స్త్రీల ప్రాతినిధ్యం వుండాలన్నది పెద్ద చర్చనీయంశమైంది. అర్హులు వుంటే రాజకీయ పార్టీలన్నీ టిక్కెట్లివ్వటానికి సిద్ధంగా వున్నాయంటున్నారు.

వసంత మోహన్రావ్ కూర్చుని ఆమెకున్న అర్హతలూ, అవకాశాలూ చర్చించుకున్నారు. అనర్హతలు- మైనస్ పాయింట్లూ కూడా చర్చించుకున్నారు. చివరికి వసంత దరఖాస్తు చేయాలని నిర్ణయించుకున్నారు.

• • •

పార్టీ ప్రధాన కార్యాలయం ఛోటా బడా రాజకీయ నాయకులతో కళ కళలాడిపోతోంది. టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు పైరవీ నాయకుల అనుగ్రహం కోసం ఆరాటపడుతూ తిరుగుతున్నారు.

లాంజ్‌లో కొంతమంది మహిళలు ఫెళ ఫెళలాడుతున్న ఖాదీ సిల్కుచీరలలో మిలమిల మెరుస్తూ అటు ఇటు తిరుగుతూ కనపడటంతో వసంతకు బెదురుపోయి కాస్త మనసు కుదుటపడింది. సెలక్షన్ కమిటీకి విజిటింగ్ కార్డు పంపి పిలుపు కోసం ఎదురుచూస్తున్న డాక్టర్ వసంతలక్ష్మి మనసు ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతోంది. ఆమెకు పిలుపు వచ్చింది. లోపల అభ్యర్థుల ఎంపిక కార్యక్రమంలో నిమగ్నమై వుంది పార్టీ అధిష్టాన వర్గం.

పార్టీ అధ్యక్షులవారి ముందు వసంతలక్ష్మి దరఖాస్తు నీట్‌గా పరిచి వుంది. ''గుడ్.. వెరీ.. గుడ్'' ఒక్కొక్క అంశం పరిశీలిస్తూ మెచ్చుకోలుగా తల పంకిస్తూ గొంతు సవరించుకుని మెల్లగా ప్రారంభించారు.

''ఈ ఎన్నికలలో మహిళలకు, యువతకు ఎక్కువగా అవకాశమివ్వాలని మన పార్టీయే ముందుగా నిర్ణయం తీసుకుంది. అందువల్లే మహిళల నుంచి- యువకుల నుండి అత్యధిక సంఖ్యలో నామినేషన్స్ రిజిష్టరయ్యాయి. మొదటి నుండి మన పార్టీ మహిళలకే ఎక్కువ ప్రాధాన్యతిస్తోంది. కానీ చూడండమ్మా మేం విజయావకాశాలున్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇవ్వాలనుకుంటున్నాం.''

వసంతలక్ష్మి ఖంగుతింది. ''అంటే!?'' అంది అమాయకంగా. ఇంకొక వృద్ధ నాయకుడు పొందూరు ఖద్దరు లాల్చీ కాలర్ సవరించుకుంటూ ''విజయావకాశాలను మేం ఇల్లా నిర్ణయిస్తాం. కులం, సానుభూతి, వెనుకబడిన వర్గాలు, రాజకీయ అనుభవం.. ఇలా ఇందులో స్త్రీలు ఎక్కువగా సానుభూతి ఓట్లు పొందగలుగుతారు.

వసంతలక్ష్మికి ఈ సానుభూతి విజయావకాశమేమిటో అర్థం కాలేదని గ్రహించిన మరో నాయకుడు వివరించాడు. క్రితం ఎన్నికల్లో ఒక నియోజక వర్గంలో శ్రీమతి రంగనాయకమ్మను నిలబెట్టి ప్రత్యర్థులపై 70వేల మెజారిటీతో గెలిపించాం. శ్రీమతి రంగనాయకమ్మ భర్త అంజిరెడ్డిగారు ప్రత్యర్థుల దాడిలో పదవిలో వుండగానే మరణించటం వలన ఓటర్ల సానుభూతిని ఆమె కొల్లగొట్టుకోగలిగారు. జిల్లాలో ఆమె ఇప్పుడు తిరుగులేని నాయకురాలు.

తమ నియోజక వర్గంలో పర్యటిస్తూ బాంబ్ బ్లాస్ట్‌లో హఠాత్తుగా పెద చౌదరిగారి స్థానంలో వారి భార్య వీరమ్మగారిని నిలబెట్టాం. అంతవరకూ ఆమె వీధి ముఖం చూసి ఎరుగదు. పెద చౌదరిగారి కటౌట్లు పెట్టి ఆవిడచేత జనానికి దణ్ణాలు పెట్టించాం. ప్రతిపక్షాల అభ్యర్థులు- సీనియర్స్‌కి డిపాజిట్ కూడా దక్కలేదు. వింటున్నావమ్మా! మన ఓటర్లలో అధికశాతం మహిళా ఓటర్లే. వాళ్లు దయార్ద్ర హృదయులు. సాటి స్త్రీ పట్ల సానుభూతి ఎక్కువ. దాడిలో కాని- రౌడీయిజం వల్లకానీ- ప్రత్యర్థుల కక్ష వల్ల కాని హృద్రోగం వల్ల కానీ ఏ కారణం చేతనైనాసరే అప్పుడప్పుడే భర్తను కోల్పోయి- పసుపు కుంకుమలకు దూరమై- భర్త ఆత్మశాంతికి నడుంకట్టి 'అమ్మా- మీ ఓటు నాకెయ్యండి...' అని భర్త ఫోటో చూపించి ఒడి చాస్తే కన్నీటితో కరిగిపోయి గెలిపించని మహిళ వుంటుందా! అంతేకాదు వాళ్లు ఓటేయడమే కాదమ్మా మిగతావాళ్లని కూడా ప్రభావితం చేసి వేయిస్తారు. కష్టంలో వున్న సాటి స్త్రీని గెలిపిస్తారు. స్త్రీ మనసు- స్త్రీ శక్తి మన దేశంలో అంత గొప్పది మరి.. అందుకని..'' వెంటనే ఇంకో నాయకుడు అందుకుని 'అందుకని ఈసారి మీ నియోజక వర్గంలో ఈమధ్య రోడ్ ప్రమాదంలో మరణించిన జిల్లా కార్యకర్త శివరామయ్య భార్య తిరుపతమ్మగారిని ఎంపిక చెయ్యాలనుకుంటున్నాం. ఆవిడ పుట్టెడు దుఃఖంలో వున్నారు. అయినా మావాళ్లు కన్విన్సు చేస్తున్నారు.''

డాక్టర్ వసంతలక్ష్మి దిమ్మెరపోయింది.

''మీ అదృష్టం బాగుంటే నెక్స్ట్ టర్మ్ మీ కాండిడేచర్- బట్ ఫర్ దట్- మీ అర్హతలన్నీ బాగున్నాయి.''

''వద్దులెండి. మీకూ మీ సానుభూతికీ ఓ నమస్కారం'' వసంతలక్ష్మి ఒక్క ఉదుటున బయటపడింది వివర్ణమైన ముఖంతో. వచ్చిన భర్త మోహన్రావ్ ''ఏం జరిగింది? ఒకేనా?'' అని అడిగాడు.

''ఆడవాళ్లకి టికెట్ రావాలంటే ముందు వాళ్ల భర్తలు హరీమనాలిట'' కారులో కూర్చుని మంగళసూత్రం కళ్లకు అద్దుకుంటూ చెప్పింది.

''ఆ ..'' నిర్ఘాంతపోయి- అంతలోనే ఫక్కున నవ్వాడు. ''అదేగా మరి పోలి'ట్రిక్స్'!..అంటే. బాధపడకు'' వసంతని అనునయించాడు- తను సర్దుకుని.

★